క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి వాకర్స్ చేయూత


నగదు అందజేస్తున్న వాకర్స్

గోదావరిఖని: కిడ్నీ బాధితుడికి స్థానిక సింగరేణి స్టేడియం వాకర్స్ బృందం అండగా నిలిచింది. బట్టలషాపులో గుమాస్తాగా పనిచేస్తున్న శశిప్రసాద్‌కు రూ.43వేల నగదు ఆదివారం అందజేశారు. శశిప్రసాద్ రెండు కిడ్నీలు పాడవడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. బాధితుడి దీన పరిస్థితి తెలుసుకున్న వాకర్స్ అందరూ కలిసి తలా కొంత నగదు జమచేసి అతడికి అందించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి రఘు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, వాకర్స్ నామని శ్రీనివాస్, కుర్మ శ్రీనివాస్, క్రిష్ణమూర్తి పటేల్, అడ్డాల రామస్వామి, జిమ్మిబాబు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం


ప్రశంస పత్రం అందుకుంటున్న ప్రతినిధులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు, జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని ఫాటోఫామ్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ మిషన్ 1.5 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ లయన్స్‌క్లబ్ సేవలు, నూతన సభ్యత్వ నమోదును సమర్థవంతంగా నిర్వహించగా అధ్యక్షులు మాటేటి సంజీవ్, జిల్లా కోఆర్డినేటర్ వల్స నీలయ్య, మాటేటి శ్రీనివాస్‌లకు ప్రశంసపత్రం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక


విద్యార్థులతో ఐపీఎస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియ

సుల్తానాబాద్: మేడ్చల్‌లో ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు శివప్రసాద్, శ్రీకర్, బ్లెస్సీ, అన్విత ఎంపికైనట్లు పీఈటీ సత్యం తెలిపారు. మండల కేంద్రంలోని ఐపీఎస్ పాఠశాలలో ఆదివారం విద్యార్థులను అభినందించారు. ఈ నెల 5న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలబాలికల విభాగంలో రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని తెలిపారు. వారిని ఐపీఎస్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, కృష్ణప్రియ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్, శివ, సతీశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామగిరి: మండంలోని కల్వచర్ల గ్రామంలోని ప్రగతి పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి


దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌వో

సుల్తానాబాద్: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం కోరారు. మండలంలో ప్రతీ బీఎల్‌వో కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మండల వ్యాప్తంగా కొత్త దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఓటరు జాబితా నుంచి మరణించిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటు దరఖాస్తులు స్వీకరించారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


ఎలిగేడు: బుర్హాన్‌మియాపేటలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పెద్దపల్లిరూరల్: మండలంలోని అప్పన్నపేటలో సర్వే తీరును ఎంపీడీవో పరిశీలించారు. పెద్దపల్లి మండలంలోని 30 పంచాయతీల్లో 21,040 కుటుంబాలు ఉన్నాయని, అందులో ఇప్పటివరకు 2821 కుటుంబాల సర్వే పూర్తయిందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

పొరపాట్లు లేకుండా సర్వే చేయాలి

సుల్తానాబాద్: పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని స్వప్నకాలనీ, శాస్త్రినగర్, శ్రీరామ్‌నగర్ కాలనీలలో ఆదివారం సర్వే పనులను ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్స్‌కు ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్‌ను సంప్రదించాలన్నారు.

ఎలిగేడు: మండలంలో 12 గ్రామాల్లో 796 కుటుంబాలను సర్వే చేశారు. బుర్హాన్‌మియాపేటలో సీపీవో రవీందర్, తహసీల్దార్ బషీరొద్దీన్, ఆర్‌ఐ జయ సందర్శించి సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామాల్లో సర్వే ప్రక్రియ రెండోరోజు ఆదివారం ముమ్మరంగా కొనసాగింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సమాచారం నమోదు చేసుకున్నారు.


పెద్దపల్లిరూరల్: వివరాల సేకరణలో ఎన్యుమరేటర్


రామగుండం: లింగాపూర్ గ్రామంలో..


సుల్తానాబాద్: వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


పాలకుర్తి: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు


రామగిరి: కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ భాస్కర్‌రావు

పాలకుర్తి: మండల పరిధిలోని రాణాపూర్, జీడీనగర్, కన్నాల, బామ్లానాయక్‌తండా గ్రామాల్లో కన్నాల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం సొసైటీ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు మార్కెట్ నిబంధనలకు అనుగుణంగా మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని చైర్మన్ మనోహర్‌రెడ్డి రైతులను కోరారు. సొసైటీ సీఈవో సదయ్య, సిబ్బంది పుట్ట వంశీతో పాటు ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కల్వచర్లలో..


రామగిరి: మండలంలోని కల్వచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో చిందం శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, నాయకులు తోట చంద్రయ్య, బర్ల శ్రీనివాస్, బండారి సదానందం, సైండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీకమాస పురాణ సప్తాహం


బ్యానర్ ఆవిష్కరిస్తున్న సదానందం, భక్తులు

కాల్వశ్రీరాంపూర్: కార్తీకమాసం పురస్కరించుకుని మండలంలోని పెగడపల్లి విశ్వేశ్వరాలయంలో తిరుమల తిరుపతి ధర్మప్రచార పరిషత్ నేతృత్వంలో 11వ తేదీ నుంచి 17 వరకు కార్తీకపురాణ సప్తాహం నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మాచార్య నరెడ్ల సదానందం, రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఆలయంలో ఆదివారం వారు బ్యానర్ ఆవిష్కరించారు. ప్రముఖ పండితులు రామ్మోహన్‌రావు కార్తీకమాస విశిష్టత గురించి ఏడురోజులు ప్రవచనాలు, రోజువారీ కార్యక్రమాలు, 15న పౌర్ణమి రోజు మహిళలతో దీపోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. మాజీ సర్పంచులు ఆరెల్లి సుజాత రమేశ్, రాజమల్లయ్య, గ్రామస్తులు గుడిపాటి మనోహర్‌రెడ్డి, చిలువేరు సదాశివ, ముంజాల హరికృష్ణ, ముప్పిడి రమేశ్, ఈర్ల శ్రీనివాస్, వీరగోని సదయ్య, గోపగోని రాజయ్య, శ్రీకాంత్, రాజేశం, అశోక్, సూరిబాబు పాల్గొన్నారు.





హాలిడే.. జాలిడే

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్‌లో ఉన్న జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థినులు ఆదివారం తల్లిదండ్రులతో ఉల్లాసంగా గడిపారు. ప్రతీనెల రెండో ఆదివారం హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులకు చూడడానికి అనుమతి ఇస్తారు. పిల్లలతో సరదాగా గడపడానికి సమయం కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థినుల తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు చేరుకొని వారు తీసుకొని ఆహారం స్వయంగా తినిపించారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు.

ఎన్టీపీసీ సాహిత్య క్షేత్రం


పుస్తకం ఆవిష్కరిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తితో పాటు సాహిత్య క్షేత్రంగా విరాజిల్లుతుందని ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు, ఐఎన్టీయూసీ సీనియర్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో ఉదయ సాహితి–తెలంగాణ, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(ఐఎన్టీయూసీ), ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జ్యోతికిరణాలు–2 వచన సంకలన పుస్తకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగుల్లో చాలా మంది కవులు, రచయితలు ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం బాబర్ సలీంపాషా, కార్పొరేటర్ కొలిపాక సుజాతతో పాటు పలువురికి శాలువా కప్పి సన్మానించారు. ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ సభాధ్యక్షుడిగా కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం లక్ష్మయ్య, మాడిశెట్టి గోపాల్, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, తిరుమల సురేందర్, సట్టు ముత్యాలు, కొలిపాక మల్లయ్య, రావు, మల్లారెడ్డి, ఎడెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పాలకుర్తి: మండలంలోని వేంనూర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి 30 వరకు శ్రీఅలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. 25వ తేదీ సోమవారం అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం, ధ్వజారోహణ 26వ తేదీ మంగళవారం స్వామివారికి అభిషేకం, 27న ఉదయం 10:30గంటలకు శ్రీవారి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6:30గంటలకు పల్లకిసేవ జరుగుతుందని వారు వివరించారు. చివరిరోజు మహా పూర్ణాహుతి, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రముఖ జ్యోతిష్య, ఆగమశాస్త్ర పండితులు శ్రీమాన్ శ్రీనలిమికొండ శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

సంక్షిప్త వార్తలు

• జీడీకే–5 ఓసీపీలో షావల్‌ను ఢీకొన్న డంపర్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో శనివారం రెండోషిఫ్టులో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. క్వారీలోని 3సీమ్‌లో నర్మదా షావల్ బొగ్గు లోడింగ్ పనులకు ఉపక్రమిస్తున్న క్రమంలో డంపర్ రివర్స్ తీస్తుండగా షావల్‌కు ఢీకొన్నది. అయితే డంపర్ వేగంగా వెనక్కివస్తున్న విషయాన్ని గమనించిన షావల్ ఆపరేటర్ షావల్‌ను స్వింగ్ చేసి క్యాబిన్‌ను మరో వైపు తిప్పడంతో తృటిలో ప్రమాదం తప్పింది. లేకుంటే షావల్ క్యాబిన్ వైపు డంపర్ ఢీకొంటే అందులో ఆపరేటర్‌కు పెద్ద ప్రమాదం జరిగేదని కార్మికులు అంటున్నారు. ఈ ఘటనపై జీఎం లలిత్ కుమార్ సీరియస్‌గా స్పందించి విచారణకు ఆదేశించారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామంలో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఓదెల గ్రామం మీదుగా కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపులకు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి ధృవపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

• రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని రామాలయంలో పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకుని ఈనెల 15న శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

• రేషన్ బియ్యం పట్టివేత

మంథని: మున్సిపల్ పరిధిలోని మందాటలో చల్ల నారాయణ ఇంట్లో అక్రమంగా ఆరు ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ ఉన్న రెండు క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు తెలిసిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారులతో సంయుక్తంగా తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. చల్లా నారాయణ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి రాచర్ల రమేశ్ అనే వ్యక్తికి లాభానికి విక్రయిస్తున్నట్లు వివరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

• కులగణనను స్వాగతిస్తున్నాం

సుల్తానాబాద్: సమగ్ర సామాజిక కులగణన సర్వేను స్వాగతిస్తున్నామని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆవునూరి సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణనతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎంత మంది ఉన్నారో తెలుస్తుందని, జనాభా ఆధారంగా రిజర్వేషన్‌ను స్వాగతిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీసీ, ఎస్సీల రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

• కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

గోదావరిఖని: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాజకీయ ప్రస్థానం 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేశ్, నాయకులు కాల్వ లింగస్వామి, రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, ముస్తఫా, బొమ్మక రాజేశ్, గట్ల రమేశ్, కొప్పుల శంకర్, పంజా శ్రీనివాస్, దూళికట్ట సతీశ్, దాసరి విజయ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

• బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్లలో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి తగిలి గాయాలపాలయ్యాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఓదెల మండలం పెద్దకొమిర గ్రామానికి చెందిన గజ్జెల కుమారస్వామి ఆదివారం సాయంత్రం కాల్వశ్రీరాంపూర్ నుంచి పెద్దకొమిరకు బైక్‌పై వెళ్తూ పందిల్ల శివారులో అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతడికి తీవ్రగాయాల పాలయ్యాడు. గ్రామస్తుల సమాచారం మేరకు 108 సిబ్బంది మధు, బాలు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

• ఎంపీ ఈటల పరామర్శ

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన ధనాలకోట వనిత ఇటీవల మరణించారు. కాగా ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ వారి కుటుంబీకులను పరామర్శించారు. వనిత అల్లుడు చైతన్య ఈటల రాజేందర్ వద్ద పీఆర్‌వోగా పనిచేస్తున్నారు. నాయకులు కొలిపాక శ్రీనివాస్, రాజేందర్, సంపత్‌రావు, పల్లె సదానందం, ఉప్పు కిరణ్, శ్రీకాంత్, రమేశ్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

• ప్రశాంతంగా ల్యాబ్ టెక్నీషియన్ పరీక్ష

రామగిరి: మంథని జేఎన్‌టీయూలో కళాశాలలో నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 పరీక్ష ప్రశాంతగా జరిగింది. 150 మంది విద్యార్థులకు 147 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



జూలపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్ పథకంలో గ్రామీణ రోగులకు వైద్యసాయం అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షెడ్డు, దానికి అనుబంధంగా వాష్‌రూం నిర్మించారు. కానీ గుత్తేదారు వాష్‌రూమ్‌కు తలుపు బిగించకపోవడంతో వైద్యంకోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వాష్‌రూమ్‌కు తలుపు బిగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఆటంకాలు లేకుండా బొగ్గు ఉత్పత్తి చేపట్టాలి


మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గనిని ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ ఆదివారం సందర్శించారు. గని వ్యూ పాయింట్ నుంచి క్వారీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. గనిలో యంత్రాల వినియోగం, ఉత్పత్తి లక్ష్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని సూచించారు. ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, అధికారులు విజయశేఖర్ బాబు, చంద్రశేఖర్, రామారావు, కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో భాగస్వాములు చేయాలి


మాట్లాడుతున్న రాజన్న, నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ రామగుండం ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన విద్యుత్ ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 29న జరగనుంది. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న ఎన్టీపీసీ యాజమాన్యాన్ని, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను కోరారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం ప్రాంతంలో ఉన్న థర్మల్ ప్రాజెక్టుతో కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులోని పనులు చేపట్టేందుకు మైనస్ టెండర్లతో పనులు దక్కించుకుని ఉద్యోగాల కల్పన పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. థర్మల్ ప్రాజెక్టు విషయంలో, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల విషయంలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు, స్థానిక నిరుద్యోగులు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ ప్రజాస్వామిక వాదులు, అందరూ కలిసి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో న్యూడెమోక్రసీ నాయకులు చిలుక శంకర్, బుచ్చన్న, రాయమల్లు, వసంత్, కొమురయ్య, రమేశ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి


మాట్లాడుతున్న నంది రామయ్య

రామగుండం: దేశంలో, రాష్ట్రంలో పాలక పార్టీలు మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతున్నాయని, కార్పొరేట్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య అన్నారు. శనివారం రాత్రి అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ భగత్‌సింగ్ విగ్రహం వద్ద అర్ధరాత్రి వరకు అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం పలువురు విప్లవకారులు, వక్తలు అమరులైన వారిని స్మరించుకొని వారి పోరాటపటిమను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా ప్రతినిధులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, జిందం రాంప్రసాద్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, మార్త రాములు, గూడూరి వైకుంఠం, కోడిపుంజుల లక్ష్మి, కట్ట తేజేశ్వర్, మార్త రాధ, పెండ్యాల సాయమ్మ, తీగుట్ల రాములు, బండి అశోక్, కల్వల రాయమల్లు, వేముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి


కొలనూర్ గ్రామ శివారులో కోతకు గురైన రోడ్డు

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామ శివారులోని ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు ప్రమదాల బారిన పడే అవకాశం ఉంది. కొలనూర్ నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. సంబంధిత శాఖాధికారులు మరమ్మతు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే కోతకు గురైన రహదారికి మరమ్మతు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆశ్రమం

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీలో నిర్మించిన జిల్లా వయోవృద్ధుల ఆశ్రమం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది జనవరిలో డబ్ల్యూడీఎస్‌సీ గ్రాంట్ నుంచి రూ.70లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు.